క్లుప్తంగా

అధ్యాపకురాలికి డాక్టరేట్

నిజామాబాద్అర్బన్: గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న దేవల్ లతకు డాక్టరేట్ పట్టా లభించింది. జిల్లాలోని గుండారం చెరువుపైన లిమ్నోలాజికల్ అధ్యయనాలు అనే అంశంపైన ఆమె పరిశోధన చేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీకి అందజేశారు. వీటిని పరిశీలించిన ఆ విభాగపు ఆచార్యులు దేవల్ లతకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఆమెను ప్రిన్సిపల్ రామ్మోహన్, సహచర సిబ్బంది అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

డిచ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడవ బెటాలియన్, డిచ్‌పల్లిలో హైదరాబాద్ బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. బెటాలియన్ కమాండెంట్ బి.రాం ప్రకాష్, అసిస్టెంట్ కమాండెంట్ కేపీ.శరత్ కుమార్, ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది, ఎస్‌సీటీపీసీస్, కేర్ హాస్పిటల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ విజయసారథి తదితరులున్నారు.

ఐలమ్మ విగ్రహావిష్కరణ

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గ్రామ ముఖద్వారం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. రజక సంఘం జిల్లా నాయకులు గూపన్‌పల్లి శంకర్, స్థానికులు రఘు, సంజీవ్ రెడ్డి, సుమన్ తదితరులు పాల్గొని ఐలమ్మ సేవలను కొనియాడారు.

పాలాభిషేకం

సిరికొండ: మండల కేంద్రంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. పంటలకు మద్దతు ధరలు పెంచినందుకు హర్షిస్తూ శుక్రవారం పాలాభిషేకం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, గోపి, రంజిత్‌రెడ్డి, తదితరులున్నారు.

మూడు సెల్‌ఫోన్ల అందజేత

ఖలీల్ వాడి: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు శుక్రవారం నగరంలోని ఆరవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై మొగులయ్య అందజేశారు. సీఈఐఆర్ ద్వారా సెల్ పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ప్రభుత్వ వైద్య కళాశాలకు ఎండీ పీజీ సీట్లు మంజూరు



నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్‌కు రేడియాలజీ విభాగంలో ఐదు ఎండీ పీజీ సీట్లను శుక్రవారం జాతీయ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమోహన్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌లకు రేడియాలజీ విభాగం వైద్యులు,సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్తదానంతో ప్రాణదానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవంతో పాటు ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థలో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఎలక్ట్రీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులు 32 మందితో పాటు సంస్థ సిబ్బంది ఇద్దరు రక్తదానం చేశారు. అంతకు ముందు యోగాసనాలు వేశారు. అతిథులుగా హాజరైన జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బుస ఆంజనేయులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీశైలం మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణాపాయంలో ఉన్న ఇతరులకు ప్రాణ దానం చేస్తుందన్నారు. సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

నిజామాబాద్అర్బన్: ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీవోకు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడారు. ప్రైవేటు పాఠశాల కళాశాలలకు చెందిన అన్ని బస్సులను ఫిట్‌నెస్ పరీక్షలు చేయాలన్నారు. నైపుణ్యం ఉన్న డ్రైవర్లను మాత్రమే బస్సులకు పెట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. యాజమాన్యాలు, ఆర్టీవో అధికారులు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం చేపట్టాలని కోరారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చందు పాల్గొన్నారు.

పనిదినాలు పెంచాలి

సిరికొండ: ఉపాధి హామీ పని దినాలు పెంచేలా కృషి చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు గడ్కోల్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు విన్నవించారు. జిల్లా కేంద్రంలో ఎంపీని వారు శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో అవకతవకలకు పాల్పడి సస్పెండ్‌లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను మళ్లీ విధుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఆయనను పూర్తిగా విధుల్లో నుంచి తొలగించాలని వారు ఎంపీకి విన్నవించారు.



బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం పదిలం



జిల్లా కోర్టులో యోగా చేస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల



సిరికొండలో.. బీజేపీ నాయకులు



సీతాయిపేట్‌లో.. ఉపాధి హామీ సిబ్బంది

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ అర్బన్, రూరల్ పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగాపై యోగా గురువులు అవగాహన కల్పించారు. యోగాడే సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు పలువురు ఆయా యోగా ప్రాంగణాల్లో యోగాసనాలు వేశారు. యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ధర్పల్లి లిటిల్ ఆర్ట్స్ పాఠశాలలో ..



నగర డీఆర్‌సీ కేంద్రంలో.. నగర మేయర్ దండునీతూకిరణ్, దివ్యాంగ విద్యార్థులు



సుభాష్‌నగర్‌లోని యోగా కేంద్రంలో ..



జక్రాన్‌పల్లి సరస్వతి పాఠశాలలో..



నగరంలోని సీఎస్ఐ మైదానంలో ..ఎన్‌సీసీ క్యాడెట్‌లు



డిచ్‌పల్లి ఖిల్లాలో యోగా ట్రైనర్ ముల్క శ్రీనివాస్‌కు సన్మానం



యోగా గురువులను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

అవినీతి ఎన్‌టీఏను ప్రక్షాళన చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): నీట్, నెట్ పరీక్షలు నిర్వహించడంలో పూర్తిగా విఫలమైన అవినీతి, అసమర్ధ ఎన్‌టీఏను ప్రక్షాళన చేయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.శివ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడారు. అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ ద్వారా విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెయూ ఏబీవీపీ అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి అమృత్‌చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, ఉపాధ్యక్షులు పావని, అనిల్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

సిరికొండ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి కోరారు. కొండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయుల జాయినింగ్ కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోన్నతులు వచ్చిన ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చూడాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నరహరి, మోజీరాం, తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్‌కు నివాళులు

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో పలు చోట్ల శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన సేవలను వక్తలు గుర్తు చేశారు.

జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు →



ఆధ్యాత్మికం

ఘనంగా బోనాల పండుగ

మోపాల్: సింగంపల్లిలో మహాలక్ష్మీ అమ్మవారి బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామం నుంచి మహాలక్ష్మీ ఆలయం వరకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మహాలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు.

గంగమ్మ ఆలయ ఉత్సవాలు

ఇందల్వాయి: గన్నారం, నల్లవెల్లి గ్రామాల్లో గంగమ్మ తల్లి ఆలయ ఉత్సవాలను గంగపుత్రులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బోనాలు ఊరేగించి భక్తులకు అన్నదానం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అభిషేకాలు, భజనలు చేశారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు చౌరస్తా వద్ద గల రామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్: జిల్లాలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని గురుకుల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రంను అందజేశారు. కమిటీ అధ్యక్షుడు నక్క రాజేందర్, కమిటీ ప్రతినిధులు గంధమాల నాగభూషణం, నట్ట బావన్న, ఆర్మూల జనార్దన్, భాస్కర్, దీపక్, నాగేశ్వర్, ఆనంద్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చ జరిగేనా..?

- కార్పొరేటర్లకు నిధులు ఇవ్వకపోవడంతో అసంతృప్తి
- నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ సమస్యలపై చర్చ జరగకుండానే కౌన్సిల్ సమావేశాలు మామా అనిపిస్తున్నారని కార్పొరేటర్లు ఆవేదన చెందుతున్నారు. వచ్చామా.. వెళ్లామా అనే రీతిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కౌన్సిల్ సమావేశాలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా సమస్యలపై చర్చ జరిగేలా చూడాలని కార్పొరేటర్లు కోరుతున్నారు. కార్పొరేటర్లకు నిధులు ఇవ్వకపోవడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. రెండేళ్లుగా జనరల్ ఫండ్ నుంచి ఒక్క రూపాయి రాలేదంటున్నారు. గతంలో రూ. కోటి చొప్పున డివిజన్‌కు మంజూరైనా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మున్సిపల్ భవనంలో జరిగే సమావేశంలో సమస్యలపై చర్చ జరుగుతుందో లేదో చూడాలి.

నిధులు ఇవ్వకుంటే నిరసన

రెండేళ్లుగా కార్పొరేటర్లకు నిధులు ఇవ్వడం లేదని బీజేపీ కార్పొరేటర్లు, డిప్యూటి ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు పేర్కొన్నారు. గత కౌన్సిల్‌లో కూడా డివిజన్‌కు రూ.10లక్షల చొప్పున నిధులు ఇస్తానని చెప్పినా కమిషనర్ ఇవ్వలేదన్నారు. నిధులు ఇవ్వకుండా కాలనీల్లో ఏ విధంగా అభివృద్ధి చేయాలన్నారు. నేడు జరిగే సమావేశంలో నిధులు ఇవ్వకుంటే నిరసన తెలుపుతామంటున్నారు.

పాల్గొననున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నగర మేయర్ నీతూకిరణ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరుగుతుంది. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

సుభాష్‌నగర్: జిల్లాలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవో ప్రశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వేల్పూర్ భూమయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా.. రైతాంగానికి అనుకూలంగా ప్రభుత్వం ఎలాంటి సానుకూల చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రైతుభరోసా పెట్టుబడి డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు అగ్గు ఎర్రన్న, బి సాయిలు, కృష్ణగౌడ్, పర్వయ్య,తదితరులున్నారు.

రాష్ట్ర సైకియాట్రిక్ మహాసభలు ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఇందూరు న్యూరో సైకియాట్రిక్ ఆస్పత్రి డాక్టర్ విశాల్, డీఅడిక్షన్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పదవ వార్షిక తెలంగాణ రాష్ట్ర సైకియాట్రిక్ మహాసభలు శుక్రవారం నగరంలో కృష్ణ హోటల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర మేయర్ దండు నీతూకిరణ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మత్తు పదార్థాలు, వాటి కలిగే నష్టాల గురించి ప్రజలకు తెలియజేయడానికి మహాసభలునిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, తెలంగాణ సైకియాట్రిక్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల, వార్షిక మహాసభల ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జార్జిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

సమాచారం..

నేడు డిచ్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం

డిచ్‌పల్లి: ఎంపీపీ చిన్నోల్ల నర్సయ్య అధ్యక్షతన శనివారం డిచ్‌పల్లి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

22 నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

నిజామాబాద్అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించి పాలిసెట్–24 మొదటి విడత కౌన్సెలింగ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 22 నుంచి 25వరకు ఉంటుందని జిల్లా సమన్వయకర్త శ్రీరామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగిసిన విద్యార్థులు వెబ్ఆప్షన్స్ నమోదు చేసుకోవాలన్నారు. పాలిసెట్ కౌన్సిలింగ్ గురించి మరింత సమాచారం కోసం సిస్టమ్ అడ్మిన్ భానుచందర్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా మహానీయుల దినోత్సవం

జక్రాన్‌పల్లి: ఒమన్‌లో మహానీయుల దినోత్సవాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవ సమితి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అంబేడ్కర్ సేవ సమితి అధ్యక్షుడు గాలిగానీ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఒమన్‌లోని సలాలలో మొదటి సారిగా సేవా దృక్పథంతో సేవ సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గల్ఫ్‌లో ఎవరైనా ప్రమాదంలో మరణించిన, విజిట్ వీసాపై వచ్చి ఇబ్బందులు పడుతున్న వారికి సంస్థ ద్వారా భరోసా కల్పించి ఇండియన్ ఎంబసీ ద్వారా ఇండియాకు పంపించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,400	వెండి (కిలో)	93,500
22 క్యారెట్స్	67,710		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	56	70	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	80	120
బీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
జిర్నినుకాయ	80	100	గోబిగడ్డ	25	50
కాకరకాయ	60	90	గోబిపువ్వు	30	60
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	80	110	గోరుచిక్కుడు	60	90
పుదీనా	60	90	చిక్కుడుకాయ	90	120
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఓషియన్)

స్క్రీన్-1 మహారాజ(తెలుగు)- 1.45,4.40, 7.35,10.3

స్క్రీన్-2 ఓమైగాడ్(తెలుగు)-11.10,4.35 ప్రభుత్వజూనియర్‌కళాశాల(తెలుగు)-1.40 నింద(తెలుగు)-7.30,10.25

స్క్రీన్-3 హనీమూన్ ఎక్స్‌ప్రెస్(తెలుగు)- 1.45 మనమే(తెలుగు)-4.40,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 మహారాజ(తెలుగు)-11.05,4.30, 7.35,10.40-మరణం(తెలుగు)-2.10

స్క్రీన్-2 ఇన్‌సైడ్ అవుట్-2(3డీ ఇంగ్లీష్)-11.25 5.00 ఏ (తెలుగు)-1.50 జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ (హిందీ)- 7.25 ముంజ్య(హిందీ)- 10.35

స్క్రీన్-3 ఓమైగాడ్(తెలుగు)-11.15,7.55 హనీమూన్ ఎక్స్‌ప్రెస్(తెలుగు)-2.00 హరోంహర(తెలుగు)-4.40 చందు చాంపియన్(హిందీ)-10.40

స్క్రీన్ -4 ఇట్లు మీ సినిమా(తెలుగు)-11.45 నింద(తెలుగు)-2.20,7.50 ప్రభుత్వ జూనియర్ కళాశాల(తెలుగు)-5.00 మనమే(తెలుగు)-10.30

దేవి మహారాజా (తెలుగు)

నటరాజ్ చందు చాంపియన్(హిందీ)

విజయ్ నింద(తెలుగు)

సంక్షిప్తం

కోజా కాలనీ మైదానాన్ని రక్షించండి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కోజాకాలనీలో ఉన్న 2,600 గజాల మున్సిపల్ మైదానాన్ని రక్షించి, క్రీడాభివృద్ధి కోసం కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ మంద మకరందును కాంగ్రెస్ మైనార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సయ్యద్ కైసర్ శుక్రవారం విన్నవించారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.అన్యాయంగా కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, విచారణ చేసి న్యాయం చేయాలన్నారు.

ఇంటర్ కళాశాలలపై సమగ్ర విచారణ జరపాలి

నిజామాబాద్అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ కళాశాలలో ఫీజులపై, వాటి వసతులపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ శుక్రవారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యుఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం జిల్లా కార్యదర్శి సంజయ్ తల్లారే మాట్లాడారు. అనుభవం లేని ఫ్యాకల్టీతో బోధన చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కళాశాలల్లో తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు మంగేష్, ఉపాధ్యక్షులు అరుణ్, తదితరులు పాల్గొన్నారు

22 లోపు సర్వే పూర్తి చేయాలి

జక్రాన్‌పల్లి: మిషన్ భగీరథ ఇంటింటి నల్లాల సర్వే ఈ నెల 22లోపు పూర్తి చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ సూచించారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్‌లో చేపడుతున్న భగీరథ ఇంటింటి నల్లాల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే పకడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

ఎంపీ అర్వింద్‌ను సన్మానించిన ఐఎంఏ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్‌రావు, సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

పాల కేంద్రం ప్రారంభం

సిరికొండ: మండల కేంద్రంలో జెర్సీ పాల కేంద్రాన్ని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య శుక్రవారం ప్రారంభించారు. నిర్వాహకులు ఆసిఫ్, జాకీర్, షకీల్, దక్కన్ న్యూస్ ఎడిటర్ అఖిల్ అహ్మద్ పాల్గొన్నారు.

కార్మికురాలి కుటుంబానికి అండగా ఉందాం

నిజామాబాద్‌నాగారం: విధి నిర్వహణలో మరణించిన మున్సిపల్ కార్మికురాలు లలిత కుటుంబానికి ఉద్యోగులు అందరం అండగా ఉందామని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరందు తెలిపారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్‌కార్యాలయ ఆవరణలో లలిత మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్మికులు అందరం కలిసి ఆర్థిక సహాయం చేద్దామని పిలుపు నిచ్చారు.

భ్రూణ హత్యలు అరికట్టాలి

నిజామాబాద్‌నాగారం: ఆడ, మగ అనే పేరుతో సమాజంలో జరుగుతున్న భ్రూణ హత్యలను అరికట్టాలని తెరవే(తెలంగాణ రచయితల వేదిక) జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ పేర్కొన్నారు. శుక్రవారం వినాయక్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. లింగ వివక్ష రూపుమాపాలని కోరారు. సభ్యులు లక్ష్మణ్, అనిత తదితరులున్నారు.